క్లుప్తంగా

పింగళి వెంకయ్యకు నివాళి



పింగళి వెంకయ్యకు నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారిణి కౌసల్య

ఓర్వకల్లు : భారత స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యకు నివాళులర్పించారు. శనివారం మండలంలోని నన్నూరు శాఖ గ్రంథాలయంలో వెంకయ్య 149వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రంథాలయాధికారిణి కౌసల్య ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన జగదీష్

పాణ్యం : మండల పరిధిలోని తమ్మురాజుపల్లె సమీపంలో ఎస్ టర్నింగ్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాల మేరకు .. కపడకు చెందిన జగదీష్ బైక్‌పై హైదరాబాదుకు బయలుదేరాడు. ఎస్ టర్నింగ్ వద్ద వాహనాన్ని అధిగమించబోయి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది.ఈఘటనలో జగదీష్‌కు గాయాలు కాగా కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

స్తంభం విరిగి పడి కార్మికుడి మృతి



మృతి చెందిన విజయ్ కుమార్

గడివేముల: ప్రమాదవశాత్తు స్తంభం విరిగి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన శనివారంమండల పరిధిలోని కొరప్రోలురు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపిన వివరాల మేరకు కొరప్రోలురు సమీపంలో నిర్మిస్తున్న 220 కేవీ సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరా నిమిత్తం స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఛత్రజిల్లా బెల్గడ గ్రామానికి చెందిన విజయ్ కుమార్ (30) విద్యుత్ పనులు చేస్తుండగా.. సపోర్టింగ్ స్తంభం విరిగి పడటంతో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు సంతానం.

పడకేసిన పారిశుద్ధ్యం



ఆర్.కె.దుద్యాల గ్రామం సచివాలయం కాలనీలో ఇళ్లముందు నిలిచిన మురుగునీరు

కర్నూలు(రూరల్): గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఆర్.కె.దుద్యాల గ్రామంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇక్కడ సచివాలయం కాలనీలోనే మురుగునీరు ఇళ్ల ముందే నిలిచి దుర్గంధం వెదజలుతోంది. పట్టించుకోవాల్సిన అధికారులు, సచివాలయ ఉద్యోగులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. రోగాలు ప్రబలక ముందే పరిశుభ్రత పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంతర్జాతీయ గుర్తింపు నటుడు బళ్లారి రాఘవ



బళ్లారి రాఘవ చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న సాహితీ వేత్తలు, కళాకారులు

కర్నూలు కల్చరల్: తెలుగు, కన్నడ, హిందీ, ఆంగ్ల భాషల్లో మేటి నటుడుగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన నటుడు బళ్లారి రాఘవ అని, ఆయన కర్నూలు అల్లుడు కావటం జిల్లా ప్రజలకు గర్వకారణమని సాహితీ వేత్తలు, కళాకారులు అన్నారు. సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో శనివారం బళ్లారి రాఘవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సాహితీ వేత్తలు, కళాకారులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. కోలాచలం శ్రీనివాసరావు, బళ్లారి రాఘవ, ధర్మవరం రామకృష్ణమాచార్యులు ముగ్గురు బళ్లారిలో ఉంటూ 150 సంవత్సరాల క్రితం తెలుగు నాటక రంగానికి విశేష ప్రచారం చేశారని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బళ్లారి రాఘవ జయంతిని అధికారికంగా ప్రకటించినా జిల్లా అధికారులు మొక్కుబడిగా నిర్వహించడం విచారకరమన్నారు. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కళాకారులు, రచయితలు దస్తగిరి, నవీన్ చౌదరి, భాస్కర్, అజీజ్, శ్రీనివాసరెడ్డి, రాజారత్నం, కేవీ రమణ, శామ్యూల్, గురుమూర్తి, సీవీ రెడ్డి,మోహన్, యాగంటీశ్వరప్ప, బాలవెంకటేశ్వర్లు, ఇనాయతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు.. సమస్యలు ఫుల్!

- కురువ గేరిలో నిరుపయోగంగా సామూహిక మరుగుదొడ్డి
- సంతగేటు వద్ద దెబ్బతిన్న మురుగు కాల్వ
- గ్రామంలో చెత్త నిర్వహణ అస్తవ్యస్తం
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువు
- గ్రామస్తులకు తప్పని అవస్థలు



కురువ పేటలో నిరుపయోగంగా వున్న సామూహిక మరుగుదొడ్డి



మరుగుదొడ్డిలో కాంక్రీట్ బెడ్డు కూలడంతో గంత ఏర్పడిన దృశ్యం

ఓర్వకల్లు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడచినా ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో ఘొల్లుమంటున్న పలు సమస్యలే ఇందుకు నిదర్శనం. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ పారిశుద్ధ్య సమస్యలపై అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కూలిన మరుగుదొడ్డి సిమెంట్ బెడ్డు

గ్రామంలో కురువ గేరి, చాకలి గేరిలో సుమారు 80 ఇళ్లకు కలిపి రెండు దశాబ్దాల క్రితం మహిళల సౌకర్యార్థం సామూహిక మరుగుదొడ్డిని నిర్మించారు. మూడు నెలల క్రితం ఈ మరుగుదొడ్డిలోని సిమెంట్ బెడ్ కూలిపోయింది. మరుగుదొడ్డి నుంచి వచ్చే మురుగునీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో సుమారు ఎనిమిది అడుగుల గుంతను తవ్వారు. అయితే గుంతపై కడ్డీలు వేయకుండానే సీసీ బెడ్డును నిర్మించారు. దీంతో కొంతకాలానికే బెడ్డు కూలిపోయి మరుగుదొడ్డి నిరుయోగంగా మారింది. బెడ్డు కూలిన సమయంలో మహిళలు దొడ్డిలో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. మరుగుదొడ్డి బెడ్డు కూలడం వల్ల అందులోనుంచి వెదజల్లుతున్న దుర్వాసనను భరించలేక చుట్టు పక్కన నివశిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పనిచేయని మురుగు కాల్వలు

గ్రామంలో చాలా చోట్ల మురుగు కాల్వలు సక్రమంగా పనిచేయక దోమలకు నిలయంగా మారినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి మర్రిచెట్టు వరకు ఇటీవల ప్రధాన రహదారికి ఇరువైపులా నిర్మించిన డ్రైనేజీ కాల్వల్లో నిలువవున్న వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో అక్కడే నిల్వ ఉంటూ దుర్వాసన వెదజల్లుతోంది. వాహనచోదకులు, పాదచారులు అటుగా రాకపోకలు చేయాలంటేనే ఛీదరించుకుంటున్నారు. అదేవిధంగా గ్రామంలోని సంతగేటు వద్ద మురుగు కాల్వ దెబ్బతినడంతో అందులోని మురుగునీరు రోడ్లపైకి చేరి జనజీవనానికి ఇబ్బందిగా మారింది. ప్రధాన రహదారి పక్కన వున్న నివాసులు ప్రభుత్వంపై, అధికారులపై నమ్మకం సన్నగిల్లడంతో ప్రజలే తమ ఇళ్ల ముందు గ్రావెల్‌ను తోలుకొని మురుగునీరు నిల్వవుండకుండా చూసుకుంటున్నారు.

మూలకు చేరిన చెత్త సేకరణ ట్రాక్టరు

మండలంలోని ఓర్వకల్లు, హుసేనాపురం, నన్నూరు గ్రామాలలో పారిశుద్ధ్య సమస్య నిర్మూలనే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి వీధికి వెళ్లి చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లు కొనుగోలు చేసింది. ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను ట్రాక్టర్‌లో వేసేవారు. దీంతో ఏ కాలనీకి వెళ్లినా పరిశుభ్రంగా వుండేది. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తలో తడిపొడి చెత్తను వేరుచేసి, గ్రామ శివారులో వుండే చెత్తసంపద కేంద్రాలకు తరలించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ వ్యవస్థ కుంటుపడిందని ప్రజలు విమర్శిస్తున్నారు. గతంలో ఒక్కొక్క వీధికి వారంలో రెండు సార్లు చెత్త ట్రాక్టర్ వచ్చి చెత్తను సేకరించేది. ప్రస్తుతం వారంలో ఒక్క రోజు రావడమే గగనమైందనే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్భాలకే పరిమితమయ్యాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా గ్రామంలో అపరిష్కృతంగా వున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని తక్షణ పరిష్కార చర్యలు తీసుకోవాలి గ్రామస్తులు కోరుతున్నారు.

దోమల బెడద ఎక్కువైంది



మురుగు కాల్వల్లో నీరు సరిగ్గా పారక, దోమల బెడద ఎక్కువైంది. ఇళ్లలోని బాతురూమ్‌ల నుంచి వచ్చే వ్యర్థనీరు కాల్వల్లోకి చేరి, ఇళ్ల ముందర నిలువ ఉంటున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. పారిశుద్ధ్య కార్మికులు గతంలో కాల్వలను సకాలంలో శుభ్రం చేసేవారు. ప్రస్తుతం వారికి సక్రమంగా నిధులు చెల్లించకుండా అలసత్వం చేయడంతో వారు కూడా కాల్వలను అరకొరగా శుభ్రం చేస్తున్నారు. – మద్దమ్మ, స్థానికురాలు

దుర్వాసన భరించలేకున్నాం



గ్రామంలోని కురువ గేరిలో వున్న సామూహిక మరుగుదొడ్డి నిరుపయోగంగా వుండడంతో అందులో నుంచి వస్తున్న దుర్వాసన భరించలేకున్నాం. మరుగు దొడ్డి సమస్యను పరిష్కరించాలని పలు సార్లు అధికారులకు విన్నవించినా, ఇప్పుడు నిధులు లేవు, చూస్తాం, చేస్తాం అంటూ నిర్లక్ష్యమైన సమాధానం ఇస్తున్నారు. మరుగు దొడ్డి సమీపంలో ఉన్న ప్రజలకు రాత్రిపూట దోమల బెడదతో కంటిమీద కునుకు లేకుండా పోయింది.

– కురువ అల్లస్వామి, వార్డు సభ్యుడు, ఓర్వకల్లు

మరుగు దొడ్డిని పునరుద్ధరించాలి



స్థానిక కురువ గేరిలో మరుగు దొడ్డి కూలిపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీలో చాలా మంది ఇళ్లకు వ్యక్తగత మరుగుదొడ్లు నిర్మించుకోలేదు. రెండు గేర్లలో కలిపి సుమారు 70 కుటుంబాలు సామూహిక మరుగు దొడ్డిపైనే ఆధారపడ్డాయి. మూడు నేలల నుంచి మంగళిగేరిలో వున్న మరుగుదొడ్డికి వెళ్లి అవసరాలను తీర్చుకోవడంతో ఆ కాలనీ వాసులు మమ్ములను ఛీకొడుతున్నారు. మా పరిస్థితిని అర్థం చేసుకొని మరుగు దొడ్డికి మరమ్మతులు చేయాలి.

– పుల్లమ్మ, స్థానికురాలు

తల్లిపాలతో కేన్సర్ ప్రమాదం తగ్గుతుంది

ఓర్వకల్లు: పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాపడం వల్ల రొమ్ము, అండాశయ కేన్సర్ వచ్చే ప్రమాదం తగ్గుతుందని సంచార వైద్య చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు తెలిపారు. శనివారం మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో నిర్వహిస్తున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. తల్లిపాలతో శిశువులకే గాక తల్లులకు ఎన్నో ప్రయోజనాలు వున్నాయని, తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం వల్ల అదనపు కిలోకేలరీలు ఖర్చు అవుతాయని, గర్భధారణ సమయంలో పెరిగిన బరువు తగ్గడానికి దోహదపడుతుందన్నారు. చనుపాలు ఇవ్వడం వల్ల గర్భాధారణ తర్వాత వచ్చే రక్తస్రావ ప్రమాదం తగ్గి, తల్లి త్వరగా కోలుకొని ఆరోగ్యంగా వుంటుందన్నారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నాగరాజు, సామాజిక ఆరోగ్య అధికారి రాధామోహన్, స్టాఫ్ నర్సులు సౌజన్య, ఉమారాణి, శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, ప్రాజెక్టనిస్టు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రఘు



గార్గేయపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పిల్లలకు తల్లిపాలనే ఇవ్వాలి..

కోడుమూరు రూరల్: పుట్టిన ప్రతి బిడ్డకు ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లి పాలే ఇవ్వాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డా.నాగప్రసాద్ బాబు సూచించారు. శనివారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా కోడుమూరులోని గ్రామ సచివాలయం-2లో తల్లిపాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా.నాగప్రసాద్ బాబు మాట్లాడుతూ ముర్రుపాలు ఎంతో శ్రేష్ఠమైనవన్నారు. ముర్రుపాలు పుట్టిన బిడ్డకు తొలి టీకాలా పనిచేయడంతో పాటు, తల్లికి బిడ్డకు అనుబంధము ఏర్పడుతుందని ఆయన సూచించారు. తల్లి పాలు ఇవ్వడం వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు.వైద్యాధికారి డా.మదన్‌శేఖర్, సిబ్బంది శ్రీనివాసులు శెట్టి, సుమలత, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

కర్నూలు(రూరల్): తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని అంగన్ వాడీ సూపర్ వైజర్ విజయలక్ష్మి అన్నారు.గార్గేయపురం -4 అంగన్ వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలో మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



చెరువుకు జలకళ

నిండుగా గార్గేయపురం చెరువు

కర్నూలు(రూరల్): కర్నూలు మండలంలో గార్గేయపురం, బి. తాండ్రపాడు, తులాశపురం గ్రామాల్లో చెరువులు ఉన్నాయి. అయితే, సరైన వర్షాలు లేకపోవడంతో తులాశపురం చెరువు ,బి.తాండ్రపాడు చెరువులు నీరు లేక వెలవెబోతున్నాయి. గార్గేయపురం చెరువుకు హంద్రినీవా కాలువ నుంచి తూముల ద్వార నీరు వచ్చి చెరుతుంది. దీంతో ప్రస్తుతం ఈ చెరువు జలకళను సంతరించుకుంది. .

పేద ముస్లింలకు పట్టాలు ఇవ్వాలి



మైనార్టీ పేదల భూములను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు : మండలంలోని కాల్వ గ్రామంలో ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న ముస్లిం మైనార్టీ పేదలకు పట్టా, పాసు పుస్తకాలను మంజూరు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. శనివారం మైనార్టీ పేదలు సాగు చేసుకుంటున్న భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వారితో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ.. ఎనిమిదేళ్ల నుంచి కాల్వ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వీరందరు సెంటు భూమిలేని నిరుపేదలన్నారు. అయితే కొంతకాలంగా భూముల విలువ పెరగడంతో గ్రామానికి చెందిన కొందరు సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకసార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించినా స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో సాగుదారులు రోకాబీ, హుస్సేన్‌బీ, మహబూబ్‌బీ, సాహెబ్, మాలిక్, రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

కోడుమూరు రూరల్: నీటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని సి.బెళగల్ తహసీల్దార్ వెంకటలక్ష్మి వీఆర్వోలను ఆదేశించారు. శనివారం సి.బెళగల్ మండలంలోని పోలకల్ గ్రామ సచివాలయంలో తహసీల్దార్ రైతులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి ఎల్‌పీఎం ఖాతాల సమస్యలున్న రైతులు తన దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులై ఉండి లబ్ధి చేకూరని రైతులు సంప్రదిస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గ్రామాల్లోని రైతులంతా నీటి పన్ను చెల్లించాలని తహసీల్దార్ కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

- గంటలోపే సమావేశాన్ని ముగించేసిన అధికారులు
- సమావేశానికి హాజరుకాని పలు శాఖల అధికారులు
- రికార్డుల్లో అందరూ హాజరు.. సమావేశంలో అదృశ్యం



యూరియా కొరతను తీర్చాలని కోరుతున్న జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి

గడివేముల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీడీఓ వాసుదేవ ఆధ్వర్యంలో ఎంపీపీ నాగమద్దమ్మ అధ్యక్షత సమావేశం నిర్వహించారు. సమావేశానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాల్సింది. చాలా డిపార్టుమెంట్‌లకు చెందిన అధికారులు హాజరూ కాకపోవడంతో ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. రికార్డుల్లో మాత్రం అందరూ వచ్చినట్లు ఉంది కాని సమావేశంలో కనబడలేదు. మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

యూరియా కొరత లేకుండా చూడండి

మండలంలో యూరియా కొరత అధికంగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా యూరియా దొరకడం లేదని, అదును దాటిన తరువాత అందించినా లాభం లేదన్నారు. వ్యవసాయాధికారులు ప్రత్యేక చొరవ చూపించి మండలానికి యూరియాను అందించాలని కోరారు. గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోయిందన్నారు. ప్రభుత్వ భూములకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయకపోడం బాధాకరమన్నారు. అర్హులైన వారందరికీ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో తల్లికి వందన పథకం ద్వారా చాలా మంది విద్యార్థులకు పడలేదన్నారు. రెండో విడతలో కూడా ఇదే పరిస్థితి ఉందని వెంటనే అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి పథకం వర్తించేలా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, ఎలక్ట్రికల్ ఏఈ ఖలీల్ పాషా, ఏఈ భాస్కర్, వెటర్నరీ డాక్టర్ సాయి హరిణి, ఎంఈఓ సుబ్బరామిరెడ్డి, హౌసింగ్ ఏఈ మూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్, డిప్యూటీ ఎంపీడీఓ మహిధర్‌రెడ్డి, ఏపీఓ వెంకటరమణ, ఏపీఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


అర్హత ఉంటే దరఖాస్తు చేసుకోండి

కోడుమూరు రూరల్: అర్హత ఉన్నా అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద సాయం అందకపోతే దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ నవ్య రైతులకు సూచించారు. శనివారం గూడూరులో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం నిధుల మంజూరు సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, జాయింట్ కలెక్టర్ నవ్య, ఆర్డీఓ సందీప్ కుమార్, ఏడీఏ సాలురెడ్డి పాల్గొని రైతులకు మెగా చెక్కు అందించారు. కార్యక్రమంలో గూడూరు, కోడుమూరు, సి.బెళగల్ మండలాల వ్యవసాయాధికారులు దస్తగిరిరెడ్డి, రవిప్రకాష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించే కాలేజీలపై చర్యలు తీసుకోండి

కర్నూలు సిటీ: నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం విద్యార్థి సంఘాల నాయకులు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి జి.లాలెప్పకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణకుమార్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్.ఎస్.యూ.ఐ) జిల్లా ఉపాధ్యక్షులు సాయికుమార్ యాదవ్‌లు మాట్లాడుతూ జూనియర్ కాలేజీల నిర్వహణకు ఏటా ఇంటర్మీడియేట్ బోర్డు అకడమిక్ క్యాలెండర్‌ను జారీ చేస్తుందని, అయితే ఆ క్యాలెండర్ ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు తరగతులు నిర్వహించడం లేదన్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థిలను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర ఉపాధ్యక్షులు అస్లాం భాష, ఎన్ఎస్‌యూఐ నాయకులు నవదీప్,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ

కర్నూలు: నగరంలోని కృష్ణా నగర్‌లోని సర్వేపల్లి ఒకేషనల్ కాలేజీలో శనివారం సైబర్ మోసాలకు అడ్డుకట్ట, రోడ్డు ప్రమాదాల నివా రణ, సీసీ కెమెరాల వినియోగంతో కలిగే ప్ర యోజనాలు తదితర అంశాలపై పోలీసులు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు జరుగుతున్న తీరును ఉదాహరణలతో వివరిస్తూ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాల పట్ల ప్రత్యేకంగా బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

కొందరికే పథకాలు

కల్లూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొందరికే పథకాలు వస్తున్నాయని నంద్యాల జిల్లా కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులు లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. శనివారం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దామోదరం సంజీవయ్య భవనంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చేది అన్నదాత సుఖీభవ కాదు... అన్నదాత దుఃఖీభవ అన్నారు. రాష్ట్రంలో 76.07 లక్షల మంది రైతులుంటే కూటమి ప్రభుత్వం ఎంపిక చేసింది కేవలం 47 లక్షల మందికే ఇస్తున్నారన్నారు. 30 లక్షల మంది రైతులకు టోకరా పెట్టారన్నారు. దీపం పథకం కింద సగం మందికి మాత్రమే ఇస్తున్నారని, తల్లికి వందనం కింద 20 లక్షల మంది మంది బిడ్డలకు కొత పెట్టారన్నారు. అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వమే రూ. 20వేలు ఇస్తుందని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఊదరగొట్టారన్నారు. తీరా గెలిచాక కేంద్రం ఇచ్చే రూ. 6వేలతో ముడిపెట్టారని విమర్శించారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ఓర్వకల్లు : మండల కేంద్రం ఓర్వకల్లులోని బుగ్గరామేశ్వర డిగ్రీ కళాశాలలో ఈ నెల 9, 10, 11 తేదీలలో జరిగే సీపీఐ 24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రమేష్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం పోస్టర్లను విడుదల చేశారు. జగన్నాథం మాట్లాడుతూ.. మహాసభలు జిల్లా సమగ్ర అభివృద్ధి, భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించడానికి చర్చావేదిక కానున్నాయని తెలిపారు. మహాసభల విజయవంతం కోసం జిల్లా ప్రజానీకం తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం మండల అధ్యక్షులు ఇదుర్‌బాషా, ఏఐవైఎఫ్ మండల నాయకులు వలి, పార్టీ సభ్యులు రాజు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం

స్మార్ట్‌మీటర్లు అమర్చితే పగలగొట్టండి

కర్నూలు(సెంట్రల్): ప్రజల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లను అమర్చితే పగలగొట్టాలని సీఐటీయూ న్యూసిటీ నగర కార్యదర్శి సీహెచ్ సాయిబాబా, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.రాముడు పిలుపునిచ్చారు. శనివారం కర్నూలు మార్కెట్ యార్డు, కల్లూరు ఎస్టేట్‌లోని హమాలీ వర్కర్స్ యూనియన్ వేర్వేరు కార్యక్రమాల్లో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఆగస్టు 5వ తేదీన పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టే ఆందోళలను విజయవంతం చేయాలని కోరారు. అన్ని విద్యుత్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని చెప్పిన చంద్రబాబునాయుడు, లోకేష్ అధికారంలోకి రాగానే మళ్లీ వాటిని అమలు చేయడం సరికాదన్నారు. విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చి ఇప్పటికే రూ.19 వేల కోట్ల భారాలను ప్రజలపై వేశారని, మళ్లీ మరో రూ.12 వేల కోట్ల భారం మోపేందుకు కూటమి సర్కార్ సిద్ధమవుతుండడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.గోవిందు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కంటపడితే వెంటపడతాయ్!

గడివేముల: మండల కేంద్రమైన గడివేములతో పాటు దుర్వేశి, గడిగరేవుల, చిందుకూరు, బిలకలగూడూరు, కరిమద్దెల గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధుల్లో వృద్ధులు, చిన్నపిల్లలు, వాహనదారులు రోడ్లపై వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల వెంటపడటంతో కిందపడి గాయాలపాలైన సంఘటనలు అనేకం. ఆయా గ్రామాల్లోని వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు ప్రజల వెంట పడి భయాందోళనకు గురిచేస్తున్నాయి. కొత్త వ్యక్తులు వీధుల్లో నడిచి వెళ్లేందుకు సాహసించడం లేదు. కుక్కలు వీధుల్లో అధికంగా సంచరించడమే కాకుండా చిన్న పిల్లల మీదకు వెళ్లి గాయాలపాలు చేస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి తప్పించి కుక్కలను వేరే చోటికి తరలించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గడివేముల బీసీ కాలనీలో గుంపుగా రోడ్డు అడ్డంగా ఉన్న కుక్కలు